క్లుప్తంగా

14వ రోజుకు సమ్మె



సమ్మె చేస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్‌: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని సమగ్ర శిక్షా ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌ కార్యాలయం ముందు చేస్తున్న సమ్మె 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్రశిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్‌ చేయాలని, సమాన పనికి సమాన వేతనం, జీవిత బీమా, రూ.10 లక్షలు ఆరోగ్య బీమా సౌకర్యం, పదవీ విరమణ బెనిఫిట్స్‌, 12 నెలల వేతన స్కేల్‌ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ, యూఆర్‌ఎస్‌ సమగ్ర శిక్షా సిబ్బంది తుకారాం, మోహన్‌, గాగేశ్‌, సంతోష్‌, రాజేశ్‌, ప్రశాంత్‌, మల్లేశ్‌, రమాదేవి, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్‌: తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్‌లు అందించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల మైనార్టీ మహిళలు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పని దినాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ప్రెస్‌క్లబ్‌ కార్యవర్గం ఎన్నిక

రెబ్బెన: మండల ప్రెస్‌క్లబ్‌ నూతన కార్యవర్గాన్ని సోమవారం గోలేటిలో మండల వర్కింగ్‌ జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోలేటిలోని భీమన్న స్టేడియంలో నిర్వహించిన మండల వర్కింగ్‌ జర్నలిస్టుల సమావేశంలో క్లబ్‌ గౌరవ అధ్యక్షుడిగా సామిల్ల సంపత్‌కుమార్‌, అధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వినయ్‌కుమార్‌, ఉపాధ్యక్షుడిగా ప్రకాశ్‌, సంయుక్త కార్యదర్శిగా విజయలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి



ఉట్నూర్‌ ఐటీడీఏ వద్ద రైతులు

బెజ్జూర్‌: పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని మండలంలోని లంబాడిగూడ గ్రామపంచాయతీ రైతులు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను కోరారు. ఈమేరకు భూక్యా సంతోష్‌ నాయక్‌ ఆధ్వర్యంలో సోమవారం ఉట్నూర్‌ ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఏళ్ల పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఐటీడీఏ పీవో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో గ్రామస్తులు ఆత్రం సకారాం, కోరేత శ్రీనివాస్‌, కుమురం లచ్చయ్య, పొట్టి మారయ్య పాల్గొన్నారు.

'అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు'



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రెబ్బెన: పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు అగ్రవర్ణ భావజాలానికి నిదర్శనమని అంబేడ్కర్‌ సంఘం మండల అధ్యక్షుడు కోబ్రఘడే మొండి అన్నారు. అంబేడ్కర్‌ పట్ల కేంద్ర హోం శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం మండల కేంద్రంలో దళిత బహుజన, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ జెడ్పీటీసీ సోమయ్య, సంతోష్‌, మాజీ ఎంపీటీసీ మదునయ్య, మాజీ సర్పంచ్‌ గంటుమేర, రవీందర్‌, వెంకటేశ్వర్లు, రత్నం వెంకటి, మాజీ ఉప సర్పంచ్‌ శ్రీధర్‌, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు రమేశ్‌, దేవాజీ, ఆనంద్‌రావు, చిరంజీవిగౌడ్‌, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పీవీ నర్సింహారావు వర్ధంతి

రెబ్బెన: మండల కేంద్రంలోని బస్టాండ్‌ వద్ద మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతిని సోమవారం మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్‌ కుంటుపడిన ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టిన ఘనత పీవీకే దక్కుతుందన్నారు. బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు దేవాజీ, మాజీ జెడ్పీటీసీలు సోమయ్య, సంతోష్‌, మాజీ ఎంపీటీసీ మదునయ్య, నాయకులు చిరంజీవిగౌడ్‌, గంటుమేర, రవీందర్‌, తిరుపతి, ఆనంద్‌రావు, తిరుపతి పాల్గొన్నారు.

నిప్పు..నేలకు ముప్పు

- వరి కొయ్యలు కాల్చవద్దంటున్న అధికారులు
- భూసారం తగ్గుతుందని హెచ్చరిక
- భూమిలోనే కలియదున్నాలని సూచన
- నేడు రైతునేస్తం కార్యక్రమంలో రైతులకు అవగాహన



కౌటాలలో కాల్చిన వరి కొయ్యలు

కౌటాల: జిల్లాలో ప్రస్తుతం వరి కోతలు పూర్తి కాగా రైతులు వరి కొయ్యలను కాల్చి యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. వరి కొయ్యలను కాల్చితే భూసారం తగ్గడంతో పాటు కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదాలు జరుగుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. నేడు కౌటాల రైతు వేదికలో ఉదయం 10 గంటల నుంచి రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో 'వరి కొయ్యలు కాల్చడం -నష్టాలు' అనే అంశంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పించనున్నారు.

మంటలతో ప్రమాదం

వరికొయ్య కాళ్లను కాలుస్తుండగా వీచే గాలులకు మంటలు వ్యాపించి సమీపంలో ఉన్న గడ్డివాములు కాలిపోయే ప్రమాదం ఉంది. పొలాలకు దగ్గరగా ఉన్న పలు పంటలు కూడా కాలిపోయే పరిస్థితి ఉంటుంది. రైతులు వారి పొలాల్లోని వరి కొయ్యలను కాల్చే సమయాల్లో చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవు. అయితే రోటవేటర్‌ సాయంతో వరికొయ్యలను భూమిలోనే కలియ దున్నితే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. గడ్డి కుళ్లి సేంద్రియ ఎరువుగా మారుతుంది. పోటాషియం, నత్రజని, భాస్వరం మొక్కలకు అందుతుంది. దున్నటానికి ముందు మార్కెట్‌లలో దొరికే సింగిల్‌ సూపర్‌ పాస్ఫేట్‌ ఎకరాకు 150 కిలోలు చల్లితే త్వరగా మురిగి భూమిలో కలిసిపోతుంది. అనంతరం 20 రోజుల తర్వాత నాటువేస్తే రసాయన ఎరువులను ఎక్కువగా వాడాల్సిన అవసరం ఉండదు.

భూసారానికి ముప్పు..

ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 56వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. ఇప్పటికే దాదాపుగా అన్ని ప్రాంతాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. వరికోతల అనంతరం కొయ్యకాళ్లను కాల్చే సమయంలో రైతులు ఏ మాత్రం ఆదమరిచినా పెను ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. కూలీల కొరత కారణంగా చాలా గ్రామాల్లో రైతులు వరికోత యంత్రాల (హార్వెస్టర్ల)తో పంటలను కోయించారు. కోతలు పూర్తయిన తర్వాత వ్యవసాయ భూముల్లో మిగిలిపోయిన కొయ్యకాళ్లను కాలుస్తుంటారు. ఈ సమయంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కొందరు రైతుల నిర్లక్ష్య ధోరణితో గతంలో అగ్ని ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. వరి కోతలకు యంత్రాలు లేనప్పుడు రైతులు కూలీ లను పెట్టి కొడవళ్లతో పంట కోతలు చేపట్టేవారు. కళ్లాలు ఏర్పాటు చేసుకుని ధాన్యాన్ని నూర్పిడి చేసే వారు. ఈ పద్ధతిలో వరి దంటును పూర్తిగా కిందకు కోసేవారు. అలా మిగిలిపోయిన కొయ్యలను కలియదున్ని మళ్లీ సాగు చేసేవారు. దీంతో కొయ్యలు కుళ్లిపోయి ఎరువుగా మారి భూసారం పెరిగేందుకు దోహదపడేది. కానీ కొన్నేళ్లుగా వరికోత యంత్రాలు అందుబాటులోకి రావడంతో వాటితోనే కోతలు చేపడుతున్నారు. వరికర్రలను పైపైన కోయడంతో కొయ్యలు మిగులుతున్నాయి. వాటికి నిప్పంటించి కాల్చి వేయడంతో పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు, కీటకాలు మృతి చెందుతాయని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో భూసారానికి నష్టం కలిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

కొయ్యలు కాల్చితే నష్టం



వరి కోతలు పూర్తికాగానే రైతులు సులువుగా వరి కొయ్యలకు నిప్పంటిస్తున్నారు. ఇలా చేయడంతో వాతావరణ కాలుష్యంతో పాటు మంటల వేడిమికి పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయి. వరి కొయ్యలను కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఎరువుల భారం తగ్గడంతో పాటు ఖర్చుల భారం తగ్గుతుంది. చీడపీడలు, తెగుళ్లు తగ్గి పంటల దిగుబడి పెరుగుతుంది. మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలి.

– ప్రేమలత, ఏవో, కౌటాల

శబరిమలకు తరలివెళ్లిన స్వాములు



ఆలయంలో పూజలు చేస్తున్న గురుస్వామి

ఆసిఫాబాద్‌అర్బన్‌: అయ్యప్పస్వామి దీక్షాపరులు సోమవారం జిల్లా కేంద్రం నుంచి రైలు ప్రయాణం ద్వారా శబరిమలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీ హరిహరపుత్ర అతయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి ముసునూరి సూర్య భాస్కరశర్మ ఆధ్వర్యంలో శబరియాత్రకు వెళ్లే స్వాములకు ఇరుముడులు కట్టించి, స్వామికి అభిషేకంతో పాటు శరణు ఘోష చేయించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. స్వాములను శబరికి పంపేందుకు భక్తులు, కుటుంబసభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శబరియాత్రకు సోమవారం ఐదుగురు స్వాములు శబరికి తరలివెళ్లారు. శబరికి తరలివెళ్లిన వారిలో కలకుంట్ల శ్రీధర్‌స్వామి, సాయిని కేదారి, బాల ప్రసాద్‌, తాటిపల్లి ఆశిష్‌, దేవునూరి రమేశ్‌లు ఉన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వేణుగోపాల్‌, చంద్రమోహన్‌, వెంకట్‌గౌడ్‌, కిషన్‌, మోహన్‌, శ్రీనివాస్‌, మహేశ్‌, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సు



లింగాపూర్‌: అవగాహన కల్పిస్తున్న అధికారులు



పెంచికల్‌పేట్‌: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

లింగాపూర్‌: మండలంలోని పిక్లాతండా, మామిడిపల్లి, కొత్తపల్లితో పాటు వివిధ గ్రామాలలో సోమవార వన్యప్రాణుల సంరక్షణపై ఇస్లాంపూర్‌ ఫారెస్ట్‌ సెక్షన్‌ అధికారి అనూష, బీట్‌ అధికారి మహేశ్‌ల ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. వారు మా ట్లాడుతూ వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్య త అన్నారు. విద్యుత్‌ తీగలను అమర్చినా, వన్య ప్రాణులను వేటాడినా, వాటికి ముప్పు కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు లోకేందర్‌, మాజీ ఎంపీపీ ఆత్మారాం, ఉద్ధవ్‌, గోవింద్‌, థావుసింగ్‌ తదితరులు ఉన్నారు.

అటవీ అధికారుల ప్రచారం

పెంచికల్‌పేట్‌: మండలంలోని బొంబాయిగూడ, ఎర్రగుంట, పోతెపల్లి, కొండపల్లి గ్రామాల్లో పులి సంచారం నేపథ్యంలో సోమవారం అటవీశాఖ అధికారులకు రైతులకు, రైతు కూలీలకు అవగాహన కల్పించారు. అటవీ సమీప ప్రాంతాల్లో పెద్ద పులి సంచరిస్తున్నందున కూలీలు జాగ్రత్తలు పాటించాలన్నారు. పనులకు వెళ్లే సమయంలో గుంపులుగా శబ్దాలు చేస్తూ వెళ్లాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



కెరమెరి: ఝరిలో..

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కెరమెరి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్‌ఆర్‌వో మజారొద్దీన్‌ అన్నారు. సోమవారం మండలంలోని ఝరి గ్రామంలో అడవుల రక్షణ, పర్యావరణ ముప్పు, అటవీ జంతువుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు వన్యప్రాణుల వేట చట్టరీత్యా నేరమన్నారు. ఆర్‌వోఎఫ్‌ఆర్‌ పట్టాలున్నంతనే సాగుచేయాలని, అధికంగా సాగు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నర్సరీ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న నర్సరీ కార్మికులు

రెబ్బెన: సింగరేణి డే సందర్భంగా కాంట్రాక్టు కార్మికులకు కోల్‌ ఇండియా వేతనాలు అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) ఏరియా ఇన్‌చార్జి క్రిష్ణమాచారి అన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం గోలేటి నర్సరీ కార్మికులు నల్లబ్యాడ్జీలతో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పన, క్యాంటీన్‌ సౌకర్యం, పండగ, జాతీయ సెలవుల అమలు, వృత్తి పన్ను మినహాయింపు, ఖాళీ క్వాటర్ల కేటాయింపులో వివక్షత ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్మిక చట్టాలు, కాంట్రాక్టు లేబర్‌ చట్టాల అమలులోనూ వివక్షతకు గురవుతూనే ఉన్నారని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులు సైతం సంస్థ పురోభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, వారిపై సవతి తల్లి ప్రేమ ప్రదర్శించటం సరికాదన్నారు. కార్యక్రమంలో నర్సరీ కార్మికులు అనిత, శారద, విజయలక్ష్మి, సాలక్క తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ కనెక్షన్‌ ఇవ్వాలని వినతి



ఎస్‌ఈకి వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీ అనుకోడ శివారులో గిరిజనుల కోటాలో విద్యుత్‌ కనెక్షన్‌ ఇవ్వాలని గిరిజనులు సోమవారం విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శేషారావుకు వినతిపత్రం అందజేశారు. బాలాజీ అనుకోడ శివారులో 12 మంది కొలావార్‌ ఆదివాసీ గిరిజనులకు భూములు ఉన్నాయని, ఆర్థికంగా వెనుకబడి ఉన్నందున విద్యుత్‌కనెక్షన్‌ తీసుకోలేకపోతున్నామని వారు తెలిపారు. గతంలో ఐటీడీఏ పీవో కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చామని, మంజూరు చేస్తామని అప్పటి ఐటీడీఏ పీవో వరుణ్‌ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఈమేరకు విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారి స్పందిస్తూ నిబంధనల మేరకు మంజూరు చేస్తామని తెలిపారు. బాలాజీఅనుకోడ గ్రామస్తులు మానెపల్లి మల్లయ్య, గంగారాం, హన్మంతు, సదాశివ్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్‌: సమ్మర్‌ సీజన్‌ యాక్షన్‌ ప్లాన్‌లో భాగంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు చేసేందుకు నూతన లైన్‌ పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌ శాఖ ఏఈ లక్ష్మిరాజం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జన్కాపూర్‌ జైల్‌ బాక్సైడ్‌, ఎస్సీ కాలనీ, పోచమ్మ కాలనీల్లో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం



రైతులను సన్మానిస్తున్న వ్యవసాయాధికారులు

కెరమెరి: మండలంలోని కెస్లాగూడ గ్రామంలోని రైతువేదికలో సోమవారం ఘనంగా రైతు దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్‌ వ్యవసాయాధికారి వెంకట్‌, యోగేందర్‌ మాట్లాడారు. ప్రజానికానికి బువ్వపెట్టే అన్నదాత దేశానికే ఆదర్శమన్నారు. రైతులు క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. రైతులు పాత పద్ధతుల్లో వ్యవసాయం చేయడం మానాలని, నూతన, సాంకేతిక పద్ధతులను అవలంభించాలన్నారు. ఆహార పంటలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రైతు సమితి అధ్యక్షుడు కేంద్రె బాలాజీ, నాయకులు, రైతులు న్యానేశ్వర్‌, పెందోర్‌ జలపతిరావు, కుడ్మెత గోపాల్‌, ఆడ రాంచందర్‌, ఆత్రం కుసుంబ్‌రావు, దుందేరావు, దేవ్‌రావు తదితరులు ఉన్నారు.

ముందస్తు క్రిస్మస్‌ వేడుకలు



ఆసిఫాబాద్‌రూరల్‌: క్రిస్మస్‌ సంబరాల్లో విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలోని సెయింట్‌ మేరీ ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు క్రిస్మస్‌ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటిక ప్రదర్శనలు క్రిస్మస్‌ తాత వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో సుభాష్‌, హెచ్‌ఎం లిబిన్‌ కేక్‌ కట్‌ చేసి యేసు క్రీస్తు జన్మ ఇతివృత్తాన్ని వివరించారు. టీచర్లు మాథ్యూ, సిని, రాకేశ్‌, కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండల కేంద్రంలోని ఆగాఫే షాలోమ్‌ చర్చిలో సోమవారం ముందస్తు క్రిస్మస్‌ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్‌ను కట్‌ చేసి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ జిల్లా నాయకులు జువ్వాజీ అనిల్‌గౌడ్‌, మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌, నంబాల మాజీ సర్పంచ్‌ చెన్న సోమశేఖర్‌, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు దేవాజీ, యూత్‌ నాయకులు ఎర్రం తిరుపతి, నాయకులు చిరంజీవిగౌడ్‌, ఫాస్టర్లు తిమోతీ, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.



రెబ్బెన: కేక్‌ కట్‌ చేస్తున్న నాయకులు, పాస్టర్లు

కౌటాల: మండల కేంద్రంలోని నజరేత్‌ మిషన్‌ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన ముందస్తు క్రిస్మస్‌ వేడుకలు అలరించాయి. క్రిస్మస్‌ వేడుకల సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు అందర్ని ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్‌ స్టీవెన్‌సన్‌ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

సిర్పూర్‌(టి): మండల కేంద్రంలో మాలి సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని సోమవారం మండల మాలి సంక్షేమ సంఘం నాయకులు తహసీల్దార్‌ కార్యాలయంలో తహసీల్దార్‌ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని మాలి కులస్తుల సౌకర్యార్థం సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు.

చదువులో ముందుండాలి



కౌటాల: రామానుజన్‌ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని హెచ్‌ఎం నానాజీ అన్నారు. సోమవారం మండలంలోని గుండాయిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం వేడుకలను నిర్వహించారు. పాఠశాలలో శ్రీనివాస రామానుజన్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మనోహర్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



శివాలయంలో హోమం చేస్తున్న భక్తులు

కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయ 51వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు అంబేద శంకరయ్య ఆధ్వర్యంలో అఖండ దీపారధన, ధ్వజారోహన, మహా గణపతి హోమం, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో మహా గణపతి హోమం నిర్వహించారు. రాత్రి ఆలయంలో అగ్నిగుండ భూమి పూజ, అగ్నిగుండముల ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయంలో ఉదయం 5.30 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, రుద్ర హోమం, పూర్ణహూతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శంకరయ్య తెలిపారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



విద్యార్థులతో ఎస్సై కమలాకర్‌

సిర్పూర్‌(టి): బాల్యవివాహాలను అరికట్టాలని ఎస్సై కమలాకర్‌ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత బృందం సభ్యులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండని వారు వివాహాలు చేసుకోవడం చట్టరీత్య నేరమన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌ బారిన పడకుండా ఉండాలని, సైబర్‌ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన క్రియేటివ్‌ వాల్‌ను పరిశీలించి ప్రారంభించారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కవితలు, పద్యాలు, డ్రాయింగ్‌లు పరిశీలించి అభినందించారు. సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌, గురుకులాల జిల్లా డీసీవో శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు సుమన్‌, గణేశ్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న దోంగ్రి ప్రవీణ్‌ కుమార్‌

వాంకిడి: బాలికలపై జరిగే లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్‌ వర్కర్‌ డోంగ్రి ప్రవీణ్‌ కుమార్‌ అన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం, చైల్డ్‌ హెల్ప్‌లైన్‌ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులకు 'ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, సంరక్షణ చట్టాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం దేశంలో ఏదో ఒకచోట బాలలపై లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయని, వాటి పట్ల బాలికలు జాగ్రత్తగా ఉండాలన్నారు. రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్యం హక్కు తదితర హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులు వెంటనే తల్లిదండ్రులకు, పోలీసులకు లేదా 1098 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. బాల్య వివాహాలతో కలిగే అనార్థాలు, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీధర్‌, కిరణ్‌, చైల్డ్‌ హెల్ప్‌లైన్‌ సూపర్‌వైజర్లు నాసీర్‌ ఉస్మాన్‌, దుర్గం పితాంబర్‌, సుగుణ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: యూటీఎఫ్‌ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం మండలాధ్యక్షుడు రావుల వినోద్‌ అన్నారు. సోమవారం కౌటాల ప్రాథమిక పాఠశాల ఆవరణలో మహాసభల పోస్టర్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28, 29, 30వ తేదీల్లో నల్గొండ జిల్లా కేంద్రంలో సంఘం మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం పని చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు మహాసభలకు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. సంఘం నాయకులు ఇందురావు, నారాయణ్‌సింగ్‌, గుణకార్‌, కృష్ణమూర్తి, కళావతి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.